

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


## రైతు భరోసా నిధులు ఎప్పుడు? : రైతు సంఘం నేతల నిరసన

**రంగారెడ్డి అర్బన్, మార్చి 10, ప్రభాతవార్త :** రైతు భరోసా నిధులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం తీవ్రంగా ప్రశ్నించింది. ఆర్బీఐ నుండి రూ.9,000 కోట్లను ప్రత్యేకంగా రైతు భరోసా కోసం అప్పుగా తెచ్చి సిద్ధంగా ఉంచామని, మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన విషయం ఇప్పటివరకు అమలు కాలేదని రైతు సంఘం నాయకులు విమర్శించారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసి 23 రోజులు గడిచినా ఇప్పటివరకు రైతు భరోసా నిధుల గురించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఆ రూ.9,000 కోట్ల నిధులు ఎక్కడ ఉన్నాయి, ఎవరి ఖాతాల్లో జమ చేశారో లేదా ఇతర అవసరాలకు మళ్లించారో ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పెంబల్సర్, తుమ్మలూరు, ఆకాట్పల్లి, కోళ్ళపడకల్, పోగండ్లు, నుజాచర్ల గ్రామాల్లో మాట్లాడుతూ రైతులకు డిసెంబర్ నెలలో ఇవ్వాల్సిన భరోసా నిధులు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. యాసంగి పంట ముగిసే సమయం దగ్గరపడుతున్నా రైతులకు సహాయం అందకపోవడం బాధాకరమని తెలిపారు.

ఫిబ్రవరి 23న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగస్తులకు భరోసా ఇచ్చిన ప్రభుత్వం, ఈ సమాజానికి అన్నం పెట్టే రైతులకు ఎందుకు భరోసా ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

శాటిలైట్ సర్వే వంటి అడ్డంకులు లేకుండా సాగుభూములున్న ప్రతి రైతుకూ రైతు భరోసా నిధులు వెంటనే జమ చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి తీవ్ర స్థాయి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇక రాష్ట్రంలో యూరియా కొరత కూడా తీవ్రంగా ఉందని తెలిపారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ వ్యవస్థ గందరగోళంగా మారిందని, బుకింగ్ చేసిన కొద్ది నిమిషాల్లోనే స్టాక్ అయిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పంటలకు సరైన సమయంలో యూరియా అందకపోతే దిగుబడులు దెబ్బతింటాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సరిపడా ఎరువులు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బి. రాంచందర్, బి. విజయ్, బి. అశోక్, కె. నరేందర్, ముజీబ్, ద్రాక్ష, రవేణ తదితరులు పాల్గొన్నారు.

# మగువలు ఎక్కడా తక్కువ కాదు



మహిళా దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు. పాల్గొన్న కలెక్టర్

> 33 జిల్లాల్లో 13 మంది మహిళా కలెక్టర్లే
>
> యూపీఎస్సీ ఫలితాల్లోనూ మహిళలదే పైచేయి
>
> మహిళామణులు తలచుకుంటే ఏదైనా అవలీలగా చేయగలరు
>
> క్రీడా రంగంలో వారి పాత్ర అమోఘం
>
> ఆడపిల్ల అని వేరుగా చూడకండి
>
> మహిళా దినోత్సవ సంబురంలో కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం మహిళా శిశుసంక్షేమ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్‌లోని సమావేశ హాలు నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు విద్య, ఉపాధి, ఆరోగ్యం, స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షి ంచారు. సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. మహిళల అభివృద్ధి ద్వారా సమాజం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. మహిళలు విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, లింగ వివక్షత పూర్తి స్థాయిలో రూపుమాపాలని అన్నారు. మన ఇంటి నుండే మార్పు ప్రారంభం కావాలన్నారు. ఆడపిల్లని వేరువేరుగా చూడకుండా ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలో గాను 13 మంది మహిళా కలెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. యూపీఎస్సీ రిజల్ట్ లో కూడా మహిళలు ఎక్కువ శాతం ఉన్నారని, మహిళ తలచుకుంటే ఏదైనా అవలీలగా చేయగలరని, అన్ని రంగాలలో రాణిస్తూ ముందుకు వెళుతున్నారని, ముఖ్యంగా క్రీడార రంగంలో మహిళల పాత్ర అమోఘమని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా పథకాలు అందుబాటులో ఉన్నాయని వాటిలో పోషన్ అభియాన్, మహిళా శక్తి ఉన్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, ఇతర ఉద్యోగులు మహిళా నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో మహిళా మంచిగా ఉంటే ఆ కుటుంబం మంచిగా ఉంటుందని, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో మరియు పాఠశాల స్థాయిలో మహిళల హక్కుల పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అంతకు ముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవము సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, హెల్త్ క్యాంప్ లను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా బ్లడ్ డొనేషన్ చేసిన వారికీ సర్టిఫికేట్ లను అందజేశారు. అనంతరం వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళ అధికారులను, వివిధ క్రీడలలో పాల్గొని గెలుపొందిన వారికి, ఉద్యోగులను మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, జిల్లా వైదాకచధికారి స్వర్ణ కుమారి, జిల్లా విద్యాధికారి రేణుక దేవి, డీపీఆర్ఓ చెన్నమ్మ, మెప్మా పీడీ రవికుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు చదువులో ముందుండాలి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

### 100 సైకిళ్ల పంపిణీకి శ్రీకారం



బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసిన కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 10, ప్రభాతవార్త :** బాలికలు చదువులో ముందుండాలని, అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం చేయూత నందిస్తుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఉచితంగా 100సైకిళ్లను బాలికలకు అందించటానికి కార్యక్రమాన్ని లక్ష్యంగా చేపట్టగా వీటిలో 21మంది బాలికలకు మాత్రం ముందుగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి చేతుల మీదుగా బాలికలకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని బ్యాంకర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ వంద శాతం హాజరు ఉన్న బాలికలకు మంజూరు చేశారు. అయితే మంగళవారం మాత్రం 21మంది బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఇఓ విజయ కుమారి, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్, మేనేజర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి
ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ 2



డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న ఓడిన కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు

# డబుల్ గేమ్ ఆపండి

> ఏకపక్షంగా ఇళ్ల పట్టాల పంపిణీ ఎందుకు..!
>
> స్థానిక ప్రజా ప్రతినిధులకు చెప్పలేదేమి?
>
> డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వ్యవహారంపై బిఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం
>
> కాంగ్రెస్ తీరు మారకపోతే ఆందోళన తప్పదని హెచ్చరిక

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** మేము కూడా ప్రజలు ఓట్లు వేస్తేనే గెలిచాం.. ప్రజా సంక్షేమం అభివృద్ధిలో మాకు బాధ్యత ఉంది.. మాకు తెలియకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులే వార్డుల్లో అజమాయిషీ చేస్తున్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాల పంపిణీ వ్యవహారంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల కన్నా ముందే కార్యకర్తలు లబ్ధిదారులకు ఫోన్లు చేసి పిలుచుకుంటున్నారు. ప్రభుత్వ సమాచారాన్ని క్యాప్చర్ చేసి కాంగ్రెస్ పార్టీ పరపతికోసం ఉపయోగించుకుంటున్నారు. అధికారం చేతిలో ఉంది కదా అని తమ ఇష్టం వచ్చినట్లు చేసుకుంటూ పోతే ఇక మేము కౌన్సిలర్లుగా ఎందుకు? కాంగ్రెస్ కార్యకర్తల నుండి ప్రభుత్వ పనులు చేసుకోండి? మేమెందుకు దండగ అంటూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు అంతర్మధనం చెందుతున్నారు. పట్టణంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారం రాజకీయంగా మారుతుంది. ఆయా వార్డులలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల జాబితాలు సదరు వార్డుల కాంగ్రెస్ నాయకులకు వెళ్లాయని, ప్రతిపక్ష హోదాలో ఉన్న బిఆర్ఎస్ కౌన్సిలర్లకు కొందరికి జాబితాలో ఇవ్వలేదని అయినా కూడా అనేక వార్డుల్లో తమకన్నా ముందే సమాచారాన్ని లబ్ధిదారులకు చేరవేసి వారిని క్యాప్చర్ చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం తగదని ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని బిఆర్ఎస్ కౌన్సిలర్లు మండిపడుతున్నారు. షాద్ నగర్ మున్సిపాలిటీ కార్యాలయంలో లబ్ధిదారులను పిలిచి వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు ఏం పని అని ఇంత విచ్చలవిడిగా ఇళ్ల పట్టాలను వాళ్ళ చేతితో ఎలా పంపిణీ చేస్తారని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్ తో పాటు కౌన్సిలర్లు అధికారులు ఉండాలని కాకపోతే కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణవేసి మరి ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారని వాళ్ల ఇలా చేస్తే మరి మమ్మల్ని ప్రజలు గెలిపించింది ఎందుకని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలామంది కౌన్సిలర్ల వద్ద వారి వార్డుకు సంబంధించిన ఇళ్ల జాబితా లేదని కష్టపడి దానిని సంపాదించినట్లు కొందరు కౌన్సిలర్లు మీడియాకు సమాచారం చెబుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుకు విరుద్ధంగా అనేక వార్డులు ఇండ్లు మంజూరైన వారికి గల్లంతు అయ్యాయని దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు ఏం సమాధానం చెబుతారని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. పిల్ల పంపిణీ వ్యవహారం మొత్తం రాజకీయం చేస్తూ గందరగోళానికి గురి చేస్తున్నారని అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తే సరిపోదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆందోళనకు దిగాల్సి ఉంటుందని బిఆర్ఎస్ కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. రాజకీయాలకు పాలిస్తున్నామని ఎమ్మెల్యే చెబుతుండగా ఇక్కడ పార్టీ వర్గాలు మాత్రం దానికి విరుద్ధంగా విభిన్నంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష నాయకులు అంటున్నారు.

గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల జాబితాలో తమ పేర్లు మాయం అయ్యాయని చాలామంది లబ్ధిదారులు టిఆర్ఎస్ కౌన్సిలర్ల ముందు గోడు వెళ్ళ పోసుకుంటున్నారని చెబుతున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరి మానుకోవాలని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఆయా వార్డుల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు కూడా ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తుంటే ప్రజాస్వామ్యం అపహాస్యం కాదా అని టిఆర్ఎస్ కౌన్సిలర్లు మండిపడుతున్నారు.

## విధుల్లో నిరక్ష్యం

# రికార్డులు అస్తవ్యస్తం

> ఫరూక్‌నగర్ మండలంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్
>
> కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ
>
> ఫరూక్ నగర్ మండల పంచాయతి అధికారికి ఛార్జ్ మెమో

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలంలో ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సస్పెండ్ చేశారు. వీరితోపాటు మండల పంచాయతీ అధికారికి చార్జ్ మెమో జారీ చేశారు. ఫరూక్ నగర్ మండలంలోని కాశిరెడ్డి గూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి వాసవా చారి, అదేవిధంగా బూర్గుల గ్రామ కార్యదర్శి సరోజలను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాసవా చారి రికార్డుల నిర్వహణలో విఫలం చెందడమే కాకుండా ఉద్యోగంలో అలసత్వం ప్రదర్శించినందుకు అతనిపై సస్పెన్షన్ వేటు పడింది. అదేవిధంగా బూర్గుల గ్రామ కార్యదర్శి సరోజ ఎలాంటి అనుమతులు లేకుండా సెలవుపై వెళ్లిపోవడం ఉద్యోగం పట్ల నిరక్ష ్యం చేయడంతో ఆమెను కూడా సస్పెండ్ చేసుకున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శులను దిశా నిర్దేశం చేయడంలో ఫరూక్ నగర్ మండల పంచాయతీ అధికారి జయంత్ రెడ్డి విఫలం కావడంతో ఆయనకు కూడా కలెక్టర్ ఛార్జ్ మెమో జారీ చేశారు. ఈనెల తొమ్మిదిన జిల్లా పంచాయతీ అధికారి ఆయా గ్రామాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ లోటుపాట్లు గ్రహించిన అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

## గుండెపోటుతో విప్ గన్‌మెన్ మృతి

### మహేందర్‌రెడ్డి వద్ద 15 ఏళ్లుగా డ్యూటీ

### మృతదేహాన్ని చూసి చలించిన పట్నం



విజయకుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 10, ప్రభాతవార్త :** ప్రభుత్వ విప్‌పట్నం మహేందర్‌రెడ్డి వ్యక్తిగత భద్రత సిబ్బందిలో ఒకరైన విజయకుమార్ (38) గుండెపోటుతో మృతిచెందారు. వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడకు చెందిన విజయ్ మంగళవారం తెల్లవారు జామును హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ వద్ద విధి నిర్వహణకు సిద్ధమవుతుండగా అస్వస్థతకు గురైనారు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స నిర్వహించి ఇంటికి పంపించారు. కొంతసేపటికే మరోసారి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. సుమారు 15 ఏళ్లుగా పట్నం మహేందర్‌రెడ్డి వద్ద విజయ్ గన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. అత్యంత నమ్మకమైన భద్రత సిబ్బందిగా గుర్తింపు పొందారు. మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే, మంత్రి, ఎమ్మెల్సీ, విప్ హోదాలో ఉంటూ విజయ్ సేవలను కొనసాగించారు. సుదీర్ఘకాలం పాటు సేవలు అందించిన తాండూరు, వికారాబాద్, చేవెళ్ల ప్రాంతాల ప్రజలు ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విజయ్ మరణవార్త తెలియగానే మహేందర్‌రెడ్డి హుటాహుటిన వికారాబాద్‌కు చేరుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని చూసి కంటతడి పెట్టారు. మృతుని కుటుంబీకులను పరామర్శించారు. కుమారుడు యశ్వంత్, కూతుళ్లు దన్వి, దివిలను విప్ ఓదార్చారు. విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించేవారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేసేందుకు మహేందర్‌రెడ్డి సిద్ధపడినట్లు తెలిసింది. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మహేందర్‌రెడ్డి వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుర్లపల్లి రమేష్‌కుమార్, మాజీ జడ్పీటీసీ షరీఫ్, నరోత్తమరెడ్డి, సాయిరెడ్డి, పీఆర్వో యాస మల్లారెడ్డి తదితరులు కూడా వెళ్లి విజయ్‌కి నివాళులు అర్పించారు.



మృతుని పిల్లల్ని ఓదారుస్తున్న విప్ మహేందర్‌రెడ్డి

అందరివాడు విజయ్ : ఎంతో కష్టపడి పోలీసు డ్యూటీలో చేరిన విజయ్ అందరివాడుగా గుర్తింపు పొందాడు. వికారాబాద్ ప్రాంతంలో జన్మించిన ఆయన సహచరులకు ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రోత్సహించేవాడని స్నేహితులు గుర్తు చేస్తున్నారు. 15 ఏళ్లుగా మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి వద్ద విధులు నిర్వహిస్తున్నా ఏనాడూ చేయి చాచే పరిస్థితి తెచ్చుకోలేదని సన్నిహితులు వ్యాఖ్యానించారు. డ్యూటీ పట్ల అంకితభావం, క్రమశిక్షణ కనబరచేవారని బావ ధన్నారం ఆనంద్ గుర్తు చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగం పెరగాలి: కలెక్టర్

**మహేశ్వరం, మార్చి 10, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం తాసిల్దార్ కార్యాలయం, సిరిగిరి పురం గ్రామాన్ని ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాసిల్దార్ భవన నిర్మాణానికి నిధులను సమకూరుస్తామని ఆ పనులను వెంటనే మొదలు పెట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయితే గృహప్రవేశాలు చేయించాలని ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లను హౌసింగ్ ఏఈలు, ఎంపీడీవోలు పర్యవేక్షి ంచాలని ఆయన సూచించారు. ఇండ్లు పూర్తయిన వాటిని ఉగాది లోపు గృహప్రవేశాలు అయ్యే విధంగా చూడాలని ఆయన అన్నారు. సిరిగిరి పురం గ్రామంలో పాలిటెక్నిక్ భవనానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అనంతరం సిరిగిరి పురం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సరైన సమాధానం చెప్పకపోవడంతో అన్ని వసతులు ఉన్నప్పటికీ విద్యార్థులకు ఎందుకు మెరుగైన విద్యను అందించడం లేదని ఉపాధ్యాయులపై ఆయన ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఎంపీవో ఇన్చార్జి ఎంపీడీవో రవీందర్ రెడ్డి, డిటి నరేష్, గిరిధర్ రాజు, సిరిగిరి పురం సర్పంచ్ దయాల కృష్ణవేణి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.



## సిరిగిరిపూర్‌లో ఆకస్మిక తనిఖీ

**రంగారెడ్డి అర్బన్, మార్చి 10, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మహేశ్వరం మండలం లోని సిరిగిరిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, మహేశ్వరం ప్రధాన రహదారిలో జరుగుతున్న శుభ్రత పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.

## జవహర్ నగర్‌లో కారు బీభత్సం

### - ముగ్గురు మున్సిపల్ కార్మికులకు గాయాలు

**జవహర్ నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జవహర్ నగర్‌కు చెందిన శ్రీ గిరవేని రవి (42) మున్సిపాలిటీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం సమయంలో అంబేద్కర్ నగర్‌లోని మిల్లీనియం స్కూల్ సమీపంలో రవి తన సహచరులు నాగునూరు ప్రదీప్, మందా పెంటయ్యలతో కలిసి విధులు నిర్వహిస్తూ ఉండగా, కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్ సహాయంతో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. బాధితుడు గిరవేని రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## టీచర్ల తీరుపై విసిగి వేసారి..

# స్కూలుకు తాళం

> విట్యాల గ్రామంలో విద్యార్థుల తిరుగుబాటు
>
> జనవరి 26 తర్వాత హెచ్‌ఎం కనిపించలేదని వెల్లడి
>
> ఇంగ్లీష్ మాస్టారు లేక చదువులు కుంటుపడుతున్నాయని ఆవేదన
>
> గ్రామ సర్పంచ్‌కి వెళ్లి ఫిర్యాదు చేసిన చిన్నారులు




మీడియాకు వివరిస్తున్న విద్యార్థినులు

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి గ్రామ సర్పంచ్ ఇంటికి వెళ్లిన ఘటన ఫరూఖ్ నగర్ మండలం విట్యాల గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడి తీరుపై ఆగ్రహించిన విద్యార్థులు ఆందోళన చేపట్టారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున జెండా ఎగురవేసేందుకు వచ్చిన సార్, మళ్ళీ ఇప్పటివరకు పాఠశాల గడప తొక్కలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8, 9, 10 తరగతుల విద్యా ర్థులకు ఇంగ్లీష్ బోధించే వారు లేక చదు వు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయమై న్యాయం చేసే వరకు కోరుకునేది లేదని హెచ్చరించారు.



పాఠశాలను సందర్శిస్తున్న స్థానిక నాయకులు

## సూపరింటెండెంట్ వేధింపులు

# భరించలేకపోతున్నామ్

### ఎమ్మెల్యే బుయ్యనికి స్టాఫ్ నర్సులు ఫిర్యాదు - ఆయనను తప్పించి డాక్టర్ మూర్తికి బాధ్యతలు

### - ఎమ్మెల్యే మనోహరెడ్డి ఆదేశం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌పై స్టాఫ్ నర్సులు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా విధుల పట్ల తమను వేధింపులకు గురి చేస్తున్నారంటూ మంగళవారం శాసనసభ్యుడు బుయ్యని మనోహరెడ్డికి ఫిర్యాదు చేశారు. క్యాంప్ ఆఫీసుకు మూకుమ్మడిగా వెళ్లిన స్టాఫ్ నర్సులు తమకు జరుగుతున్న అన్యాయం, సూపరింటెండెంట్ వేధింపులపై ఏకరువు పెట్టారు. వారి ఆవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్‌కు ఫోన్ చేసి సూపరింటెండెంట్ వినయ్ గురించి తెలుసుకున్నారు. అతని పనితీరు, ప్రవర్తన మార్చుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే ఆయనను తప్పించి డాక్టర్ మూర్తికి బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. అందుకు జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారు. రెండు రోజుల్లో సూపరింటెండెంట్‌గా డాక్టర్ మూర్తి బాధ్యతలు చేపడతారని తెలిసింది. ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తరచూ ఆసుపత్రికి వెళ్లి రోగులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయో, మహిళా ఉద్యోగుల పరిస్థితిపై ఆరా తీయాలని మున్సిపల్‌చైర్‌పర్సన్ నీరజాబాల్‌రెడ్డికి సూచించారు. ఇలా ఉండగా తాను విధులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించానని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు. ఎవరినీ వేధింపులకు గురి చేయలేదని అన్నారు.

## ప్రగతి పాలనతో షాద్‌నగర్ షాన్‌దార్

### మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** మున్సిపాలిటీలో చేపడుతున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ ను షాన్ దార్ గా మారుస్తామని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని 18 ,26 వార్డుల్లో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండులో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 26వ వార్డు కౌన్సిలర్ ఎప్పి శివ, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, దిలీప్ కుమార్, సంతోషి భాయ్, చందూలాల్, శంకర్, గంగమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

## క్లిష్ట సమయాల్లో ధైర్యాన్ని కోల్పోకండి

**ధారూర్, మార్చి 10, ప్రభాతవార్త:** ధారూర్ సర్కిల్ కార్యాలయంలో సిఐ రైటర్‌గా విధులు నిర్వహిస్తూ, ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన దివ్య మృతి పట్ల పోలీస్ శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మంగళవారం ధారూర్ పోలీస్ స్టేషన్‌లో సిఐ రఘురాం, ఎస్ఐ సున్నం రాఘవేందర్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో దివ్య చిత్రపటానికి పూల మాలలు వేసి పోలీస్ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ రఘురాం మాట్లాడుతూ, నిత్యం విధుల్లో చురుగ్గా ఉంటూ, ఉన్నతాధికారుల మన్ననలు పొందిన దివ్య ఇలా అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతి పోలీస్ శాఖకు, ముఖ్యంగా ధారూర్ సర్కిల్ కార్యాలయానికి తీరని లోటని పేర్కొన్నారు. ఎస్ఐ రాఘవేందర్ మాట్లాడుతూ, క్లిష్ట సమయాల్లో ధైర్యంగా ఉండాలని, ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడటం ఆ కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిలిస్తుందని అన్నారు. అనంతరం సిబ్బంది అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి ఎస్ఐ శైలజ, బంట్వారం ఎస్ఐ విమల, పోలీసులు సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొని దివ్యతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



ఆత్మహత్యకు పాల్పడిన దివ్య కుటుంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు అధికారులు



రంగాపూర్‌లో అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌డి అధికారి సుహాసిని

## ప్రగతి ప్రణాళికపై ఆరా

**నందిగామ, మార్చి 10, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక పనులను మంగళవారం డిఆర్డిఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువాసిని రంగాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రంగాపూర్ లో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి అక్కడ చిన్నారి బాలబాలికలకు ఇచ్చే మెనుపై ఆరా తీశారు. అనంతరం తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఐదు దశల్లో నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై కొనసాగుతున్న పనులపై ఆమె ఆరా తీశారు. ప్రగతి ప్రణాళికపై జరుగుతున్న పనులపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీఓ చక్రధర్ గౌడ్, ఏపీవో కృష్ణారెడ్డి,సర్పంచ్ గోవు అంజమ్మ, ఉప సర్పంచ్ బసవరాజ్, పంచాయతి కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు నవపేట్ శ్రీను, స్వప్న రాఘవేందర్, ముచ్చర్ల శ్రీరాములు, చందు, నాయకులు గోవు రవికుమార్, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, పారిశుద్ధ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బండ్ల గణేష్‌తో కౌన్సిలర్ శివ

## బండ్ల గణేష్‌కు సన్మానం

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** హ్యాపీ బర్త్ డే గణేష్ అన్నా.. అంటూ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్‌కు కౌన్సిలర్ ఎస్సీ శివ, బీఆర్ఎస్ నాయకుడు అభిషేక్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతిలో వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన బండ్ల గణేష్‌ను వారు కలుసుకున్నారు. శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండ్ల గణేష్ మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతోనే తనకి ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానని, తనను అభిమానించే ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు 12వ వార్డులో తడి చెత్త పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధులను దరిచేరకుండా వార్డును అభివృద్ధి పరచుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగనమోని సత్తయ్య, నందిగామ మల్లేష్, కిరణ్, గంగనామోని సాయి, అఫ్సర్ పాషా, వార్డు ఆఫీసర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

**వికారాబాద్, మార్చి 10, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలనపై ఆరాతీశారు. వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రతి రోగికి సమయానికి చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలు వంటి అంశాలను పరిశీలించారు. వైద్య సేవలు మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సిబంది హాజరు రిజిస్టర్, ఎన్ సి డి స్క్రినింగ్, హౌట్, ఇన్ ఫెషేంట్ల రిజిస్టర్ లను, వార్డు రూమ్, మందుల రూమ్ లను పరిశీలించారు. సఖి కేంద్రంను పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖఅధికారి స్వర్ణ కుమారి, డాక్టర్ సౌమ్య, రజని తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి విద్యార్థినులకు వైద్య పరీక్షలు

**ధారూర్, మార్చి 10, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ధారూర్ కెజిబివి హాస్టల్‌లో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ శాంతి పర్యవేక్షణలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం బృందం విద్యార్థినులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు చేపట్టింది. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ విద్య పాల్గొని విద్యార్థినులకు రక్తహీనత (అనీమియా), ఇతర గైనకాలజికల్ సమస్యలపై ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వ హించారు. అనంతరం విద్యార్థినులకు కంటి, దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పరీక్షల సమయంలో తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించిన పలువురు విద్యార్థినులను మెరుగైన చికిత్స నిమిత్తం వికారాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా వైద్య అధికారులు వెల్లడించారు.



కెజిబివిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

## కష్టమైనా ఇష్టంగా చదవాలి

### మండల కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు

**మొయినాబాద్, మార్చి 10, ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి కష్టమైన ఇష్టంగా చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని చదువుతోనే ప్రతి ఒక్కరి తలరాతలు మారుతాయి అని ఉన్నత చదువులు చదివితే ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు గన్నేపాక నర్సింగ్ రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిచంద్ర ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్ జామెంట్రీ బాక్స్ పెన్నులు తదితర సామాగ్రి నర్సింగ్ రావు ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి జీవితంలోనైనా విద్యార్థి దశనే కీలకమని విద్యార్థి దశలో కష్టమనకుండా ఇష్టంగా చదువుకున్నప్పుడే వారి జీవితానికి బంగారు బాటలు వేసుకున్న విద్యార్థులకు సూచించారు మంచి చదువులు చదువుకున్న విద్యార్థులకు ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మంచి చదువులు చదువుకున్నప్పుడే వారి భవిష్యత్తుతో పాటు సమాజంలో కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చిన వారవుతారని, ఇప్పటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులు అవుతారని అన్నారు. మంచి స్నేహం మంచి చదువు విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ మహనీయుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. చరిత్ర తెలిసిన వారే చరిత్రను సృష్టిస్తారని, మహనీయుల బాటలో నడిచిన వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆయన తెలిపారు. అందుకే విద్యార్థులు ఈ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ మంచిగా చదివి తమ గ్రామాన్ని జిల్లా స్థాయిలో నిలబెట్టాలని అందుకు విద్యార్థులు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి లక్ష్మీ బాలయ్య, మాజీ ఎంపీటీసీ బట్టు మల్లేష్ ఉప సర్పంచ్ ఆంజనేయులు కొంగల విజయ యాదయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాములు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నడిమింటి రాములు గ్రామ పెద్దలు శంకరయ్య పొద్దుటూరు బిక్షపతి కృష్ణ సత్యనారాయణ ప్రవీణ్ వెంకటేష్ ప్రసాద్ హరి శంకర్ ఆనందం ప్రభు రత్నం ఫయాజ్ విద్యా కమిటీ చైర్మన్ వీణ గ్రామ సెక్రెటరీ శ్రీలత రెడ్డి మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సోక్‌పిట్‌లతో భూగర్భ జలాలు పెంపు

**మొయినాబాద్, మార్చి 10, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణానికి సర్పంచ్ మంగళారం యాదయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గౌడ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కమ్యూనిటీ సోక్ పిట్ వల్ల గ్రామాల్లో నిల్వ ఉండే మురుగు నీరు నేలలోకి ఇంకిపోతుందని, దోమల వృద్ధి, దుర్వాసన, వ్యాధులు వ్యాప్తి ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. సోక్ పిట్‌ల ద్వారా వృథా నీరు భూగర్భ జలాలుగా మారి భూగర్భ జలమట్టం పెరగడానికి కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామాల్లో పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇటువంటి పారిశుధ్య కార్యక్రమాలు ప్రతి గ్రామంలో చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య, ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డ్ సభ్యులు రవీందర్, మల్లేష్, జీవన్, నాయకులు శ్రీకాంత్, భాను కుమార్, ప్రవీణ్ గౌడ్, నవీన్, గణేష్, దయాకర్ రెడ్డి, మహేందర్, సంపత్, రమేష్, యాదయ్య తదితర గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి మరియు పరిశుభ్రత కోసం గ్రామ పంచాయతీ చేపడుతున్న కార్యక్రమాలకు గ్రామ ప్రజలు సహకరించాలని నాయకులు కోరారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకా తప్పనిసరి

**మాడ్గుల, మార్చి 10, ప్రభాతవార్త :** పశువుల్లో వ్యాపించే గాలికుంటు (ఎఫ్ఎండీ) వ్యాధిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత టీకాల పంపిణి కార్యక్రమాన్ని మాడ్గుల మండలంలోని ఇర్విన్ పశువైద్యశాలలో ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బావండ్లపల్లి కోటయ్య, ఉపసర్పంచ్ గాదెమోని దళపతి గౌడ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పశువులకు టీకాలు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పశువుల్లో వేగంగా వ్యాపించే ప్రమాదకర వ్యాధి కావడంతో పాడి రైతులు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

## అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కలెక్టర్‌కు వినతి

**వికారాబాద్, మార్చి 10, ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధిలోని ఎన్నెపల్లిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ని మంగళవారం కాలనీవాసులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎన్నెపల్లిలో సర్వే నెంబరు 267/అ, 267/ఇ లో జగజ్యోతి విద్యా సంస్థ పేరుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయమై మున్సిపల్ కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శివకుమార్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## వెట్టిచాకిరి నుంచి నలుగురు కూలీలకు విముక్తి

### -అధికారుల రెస్క్యూ ఆపరేషన్

**ఘట్‌కేసర్, మార్చి 10, ప్రభాతవార్త:** వెట్టిచాకిరిలో మగ్గుతున్న నలుగురు కూలీలకు అధికారులు లేబర్ రెస్క్యూ ఆపరేషన్ ద్వారా విముక్తి కల్పించారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో మంగళవారం సాయంత్రం కూలీలను వెట్టిచాకిరి, బాల కార్మికులను పని నుంచి తప్పించేందుకు రెస్క్యూ ఆపరేషన్ జరిపారు. ఎన్‌జిఓ నేషనల్ ఆదివాసీ సాలిడారిటీ కౌన్సిల్, కీసర ఆర్‌డిఓకు సమర్పించిన పిటిషన్ మేరకు లేబర్ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్మికశాఖ, శిశుసంక్షేమశాఖ, పోలీసు శాఖ, రెవెన్యూశాఖల అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేశారు.



కూలీలను తహశీల్ కార్యాలయం నుంచి స్వధర్‌హోమ్‌కు తరలిస్తున్న అధికారులు

ఈసందర్భంగా నారాయణ పేట, వనపర్తి జిల్లాలకు చెందిన నలుగురు కూలీలు కాంట్రాక్టర్ ఆధీనంలో పని చేస్తున్నట్లు గుర్తించి విచారణ జరిపి వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించారు. ఈమేరకు ఘట్‌కేసర్ తహశీల్ కార్యాలయంకు కూలీలను తీసుకువచ్చి కీసర ఆర్‌డిఓకు నివేదిక సమర్పించారు.

బాండెడ్ లేబర్, బాలకార్మికులతో పనులు చేయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఘట్‌కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం కూలీలను అధికారులు చెంగిచర్లలోని స్వధరహోమ్‌కు తరలించారు.

## అన్ని పిహెచ్‌సిల్లోనూ మౌలిక వసతులు

**తలకొండపల్లి, మార్చి 10, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలోని తలకొండపల్లి, గట్టుఇప్పలపల్లి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాల కొరత మూలంగా రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ఈ సమస్యను పరిష్కరించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో పిహెచ్‌సిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలందరికీ అవసరమయ్యే వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వైద్యుల సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల వద్దకే వైద్యులను పంపిస్తోందన్నారు. ప్రజలందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. వివిధ కేటగిరీలకు చెందిన వైద్యులు శిబిరంలో పాల్గొని 220 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సైదమ్మ, స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ అనిత, ఎంపిడివో శ్రీకాంత్, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రేణు రెడ్డి, డేవిడ్, మాజీ సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈఓ కృష్ణారెడ్డి



## టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**మాడ్గుల,మార్చి 10, ప్రభాతవార్త :** మండలం లోని ఇర్విన్ పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు తాలూకా యువ కాంగ్రెస్ నాయకుడు అభినవ్ రెడ్డి పరీక్షల దృష్ట్యా పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బావుండ్లపల్లి కోటయ్య, ఉపసర్పంచ్ దళపతి గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, సీనియర్ నాయకులు బొడ్డు శంకర్ పాల్గొని ప్రసంగించారు.

విద్యార్థులు కష్టపడి చదివి మంచి మా ర్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు పల్లెటి రాములు, నాయకులు బావుండ్లపల్లి రాములు, సలీం, కాటం గౌడ్, మహిమూద్, శ్రీకాంత్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మల్లారెడ్డిగూడలో డ్వాక్రా మహిళా సంఘం భవనానికి స్లాబ్ వేయిస్తున్న సర్పంచ్ సబితగోవర్ధన్ రెడ్డి

## దశలవారిగా గ్రామాభివృద్ధికి కృషి

**షాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ప్రజలకు అనుగుణంగా గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని మల్లారెడ్డిగూడ సర్పంచ్ అమీర్పేట్ సబితగోవర్ధన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్వాక్రా మహిళల కోసం భవనానికి స్లాబ్ ను మంగళవారం వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అలాగే గ్రామంలో మౌళిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. దశలవారిగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి దీపాలత, వార్డు మెంబర్ జ్యోతిశ్రీకాంత్, అం గన్వాడీ టీచర్ పద్మమ్మ, మహిళా సంఘం సభ్యురాలు పుష్పమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిగూడలో పశువులకు గాలికుంటూ టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

## పశువులకు టీకాలు వేయించాలి

**షాబాద్, మార్చి 10, ప్రభాతవార్త :** పశువులకు గాలికుంటు వ్యాది నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుమ్మరిగూడలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ... రైతులు పశువులకు వ్యాదులు రాకుండా గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




డబుల్ బెడ్ రూమ్ ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న దృశ్యం

## లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లు

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇంటి పట్టాలు చేతికి అందాయి.. అనుకున్న కల సాకారం కావడంతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందాలు నిండాయి.. పట్టణంలోని 17వ వార్డులో దృశ్యమిది. ఈ వార్డులో లబ్ధిదారులకు మంజూరైన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పట్టాలను మంగళవారం కౌన్సిలర్ నాజియా బేగం సర్వర్ పాషాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ చేపట్టారని, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద తాగునీరు, రహదారులు, విద్యుత్, కాలువల నిర్మాణం వంటి సదుపాయాలను కల్పించి అనంతరం ఇండ్లను ఇచ్చారని వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వడం జరిగిందన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన ఏఐఎస్‌ఎఫ్ బృందం

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో మోడల్‌గా నిర్మిస్తూ అభివృద్ధి చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ మోడల్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బృందం తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ఐఎఎస్(రిటైర్డ్)తో కలిసి సందర్శించారు. ఈ సందర్శనలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రెహమాన్, గ్యార క్రాంతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, పాల్గొన్నారు.



సంకేపల్లిగూడలో పాఠశాల ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న సర్పంచ్ లావణ్యచెన్నయ్య

## పారిశుద్ధ్యంతోనే పల్లె ప్రగతి

**షాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** పారిశుద్యంతోనే పల్లెప్రగతి సాధ్యమోతుందని పోతుగల్ సర్పంచ్ పామెన నర్సింహులు అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోతుగల్ గ్రామంలో రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రగతి ప్రణాళకలో భాగంగా ప్రతి ఒక్కరూ పశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఆరుబయట చెత్తవాఏయరాదని, చెట్లను కాపాడుతే అవి మనకు మంచి గాలిని ఇస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సావిత్రి, పంచాయతీ కార్యదర్శి ఆశోక్, వార్డు సభ్యులు చంద్రశేఖర్, కరుణాకర్ రెడ్డి, రవి, తారాసింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మనోహర్ వ్యవసాయక్షేత్రంలో పాల నాణ్యతను పరిశీలిస్తున్న ఏడి శోభారాణి, ఏఓ శ్రీనివాస్‌గౌడ్

## సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు

**ఆమనగల్లు, మార్చి 9, ప్రభాతవార్త:** సేంద్రీయ ఎరువుల వాడకంతో సాగు లో అధిక దిగుబడులు పొందవచ్చని ఆమనగల్లు డివిజన్ వ్యవసాయాధికారిణి శోభారాణి అన్నారు. సాగులో ఎదురవుతున్న సమస్యలపై రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులతో చర్చించి వాటిని నివారణకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ మంగళవారం మండల పరిధిలోని మంగళపల్లి గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఏడిఏ శోభారాణి, ఏఓ శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఏఈఓల బృందం మనోహర్ సోదరుల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. సాగులో సేంద్రీయ ఎరువులకే ప్రాధాన్యతనిస్తుండడంతో వ్యవసాయాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. సాగుతోపాటు పాడి, కోళ్ళ పెంపకం తీరును పరిశీలించి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం రంగాన్ని ప్రోత్సహిస్తుందని, సేంద్రీయ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు బాలకృష్ణ, భూదేవి, మీనాక్షి ప్రభావతి, రైతులు భాస్కర్, శ్రీను తదితరులు ఉన్నారు.

## తాండూరుకు నిధుల మంజూరుకు కృషి చేయండి

**తాండూరు, మార్చి 10, ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన వేం నరేందర్‌రెడ్డిని తాండూరు ప్రాంత నేతలు కలిశారు. బషీరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ బుస్స శంకర్‌రెడ్డి నేతృత్వంలోని పలువురు నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. గతంలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అభివృద్ధికి దండిగా నిధులు తెస్తున్నారని, వేం నరేందర్‌రెడ్డి ద్వారా కూడా ఈ ప్రాంతానికి నిధులు వస్తాయని శంకర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



వేం నరేందర్‌రెడ్డితో శంకర్‌రెడ్డి



పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి

## ప్రజాపాలనలో పచ్చదనం పరిశుభ్రత

**తలకొండపల్లి, మార్చి 10, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా మంగళవారం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మురుగు కాలువలు, వీధులను శుభ్రపరిచారు. సర్పంచ్ సునీత డోకుర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజులపాటు నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు శుభ్రపరచి, ప్రజలకు ఎలాంటి రోగాలు రాకుండా వీధులను శుభ్రపరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీనుకుంట్ల రాఘవేంద్ర గౌడ్, గ్రామ కార్యదర్శి కుమాం, వార్డు సభ్యులు సువాసిని, లట్టుపల్లి వసంత రంగా రెడ్డి, అబ్దుల్ వహీద్, రాధిక రమేష్ బండగల చందు చెవిటి మల్లమ్మ జన్య నరసింహా చెవిటి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్, యజమాని

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ధారూర్, మార్చి 10, ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూర్ మండల పరిధిలోని కుమ్మరిపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందిందని, ఈ మేరకు తన బృందంతో కలిసి అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును గుర్తించి, దానిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడిన ట్రాక్టర్ యజమాని అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## విద్యార్థుల మేధస్సుకు పదును

**మొయినాబాద్, మార్చి 10, ప్రభాతవార్త :** సాంకేతిక క్రీడా ఉత్సవాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని జేఎన్‌టియు వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి వ్యవహారాల విభాగంలో ఇకార్యాస్. ఇన్విక్టా కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన కిషన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సాంకేతిక నైపుణ్యాలు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల వంటి సమ్మేళనాలతో కూడిన కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికి తీసేలా విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా ఈ నాలుగు రోజులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణ రెడ్డి డీఎస్సీ ఎం రత్నాచారి వివిధ విభాగాల దీనిలో హెచ్ఓడీలు విద్యార్థి విద్యార్థినిలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్

**మొయినాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సర్వసాన్ని కూలిపోయి రోడ్డున పడ్డ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హైదరాబాదులో జరుగుతున్న ఆందోళనకు హాజరవుతున్న మొయినాబాద్ ప్రాంతంలోని స్థానిక ఉద్యమకారులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు నేలట మైపాల్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అప్పటి పాలకులు తమపై ఎన్నో కేసులు పెట్టారని అన్నారు.

### ఇళ్ల పట్టాలిస్తున్న తహసిల్దార్ సైదులు

## బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు పంపిణీ

**నందిగామ, మార్చి 10 ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రానికి చెందిన సుమారు 30 మంది అర్హులైన నిరుపేద మహిళలకు మంగళవారం తహసిల్దార్ సైదులతో కలిసి సర్పంచ్ కొమ్ము కృష్ణ




డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలిచ్చారు. 4 వ వార్డులో ఉత్తమ పారిశుద్ధ కార్మికురాలుగా అవార్డు అందుకున్న నిరుపేదరాలు పబ్బతి కలమ్మకు, మైనారిటీ మహిళ ఇస్రాత్ బేగంలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వరించింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, కాంగ్రెస్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు చంద్రపాల్ రెడ్డి, కుమార్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి సూరి, బొమ్మ గళ్ళ నరసింహులు, శివగళ్ల సురేష్, ప్రసాద్, చించేటి శివగౌడ్, టైలర్ కృష్ణ, నాయకులు చించేటి కృష్ణగౌడ్, పబ్బతి కరుణాకర్, శివగల సుమన్, తడకల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలి

### అధికారులకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాలు

**కొడంగల్,మార్చి 10ప్రభాతవార్త**

కొడంగల్ నియోజకవర్గం హకీంపేట్‌లో చేపడుతున్న వివిధ భవన నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంభందిత అధికారులను ఆదేశించారు.మంగళవారం దుద్యాల మండలం హకీంపేట్‌లో చేపడుతున్న ఎడ్యూకేషన్ హబ్‌లో ప్రతి ఒక సైట్‌ను పరిశీలించారు .ఈ సందర్బంగా కలెక్టర్ డిగ్రీ కళాశాల,ఇంజనీరింగ్,మెడికల్,నర్సింగ్ కళాశాలలు,ఫిజియోథెరఫి,వెటర్నరీ కళాశాల,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతంగా జరగాలని,నిర్మాణ పనులన్నియు నాణ్యత ఉండాలని,ప్రతి వారం పనుల పురోగతిపై రిపోర్టు ఇవ్వాలని అన్నారు.ప్రతి సైట్‌కు సంభందించన ప్లాన్‌ను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనుల విషయంలో పనులను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్‌తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,ఇడబ్ల్యూఐడిఎస్‌ఇ విజయ భాస్కర్,ఇఇలు,డీఈ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**మండల వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్**

**కుల్కచర్ల, మార్చి 10, ప్రభాతవార్త:** విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మండల వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ(బాలిక) బండవెల్కిచర్ల, బాలుర పాఠశాలలో విద్యార్థులకుతదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యఅధికారి కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల వైద్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్

## డంపింగ్ యార్డ్ నిర్మాణానికి భూమిపూజ

**-సర్పంచ్ చొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ ముదిరాజ్**

**కేశంపేట, మార్చి 10, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామంలో డంపింగ్ యార్డు టైప్-2 కన్వర్షన్ నిర్వహణ పనులకు మంగళవారం శ్రీకారం చుట్టిన సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి ౖ రామకృష్ణ ముదిరాజ్, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి ౖ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత తో పాటు . గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని ఎందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని సహకరించాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ రవిచంద్ర మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి గ్రామస్తులు అందరూ సహకారాలు అందించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ కిష్టయ్య గ్రామ ఉప సర్పంచ్ హనుమంత్ నాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్

## లింగంధన గ్రామంలో మహిళా దినోత్సవ వేడుకలు

**కేశంపేట, మార్చి 10, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేశంపేట మండల పరిధిలోని లింగంధన గ్రామంలో మంగళవారం సర్పంచ్ నాగిళ్ల వెంకట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాగిల్ల వెంకట్ ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్వాడి టీచర్, ఆశ వర్కర్, ఉప సర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు, మహిళా సంగం అధ్యక్షులు ,గ్రామపంచాయతీ మహిళా సిబ్బందిని ప్రత్యేకంగా పూలమాలలు వేసి శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్ మాట్లాడుతూ.గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని వెంకట్ పేర్కొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న సర్పంచ్ నాగిళ్ల వెంకట్ ,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,తదితరులు

## చిన్నారులకు పలకల పంపిణీ

**చౌడపూర్, మార్చి 10, ప్రభాతవార్త :** సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా అంగన్వాడి చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు.మహిళల చదువుల కొరకై సావిత్రిబాయి చేసిన సేవలను పలువురు కొనియాడారు.మంగళవారం సావిత్రి బాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి, మహనీయుల ఆశయాల కోసం ముందుకు సాగాలని, వికారాబాద్ జిల్లా మాలమహానాడు అధ్యక్షులు బి. వెంకటేష్ తెలిపారు.. ఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సోమలింగం, ఆర్ఐ రవి, సూపరిండెంట్ రమేష్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి అంగన్వాడీ టీచర్స్ కల్పన, అపర్ణ, బోయిని బాల్ రాజ్ , శేఖర్, చెందు మల్లేష్, నషీర్ చాకల్ పల్లి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**సర్పంచ్ శివి బాలు నాయక్**

**కుల్కచర్ల,మార్చి 10, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచ్ శివి బాలు నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ పంచాయతిలోని ప్రథమిక పాఠశాలో మధ్యాన భోజనం పరిశిబుంచారు.

అనంతరం విద్యార్థులతో భోజనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివి బాలు నాయక్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యపై దృష్టి పెంటిందన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్వర్,తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో భోజనం చేస్తున్న సర్పంచ్ శివి బాలు నాయక్

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు 12వ వార్డులో తడి చెత్త పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధులను దరిచేరకుండా వార్డును అభివృద్ధి పరచుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగనమోని సత్తయ్య, నందిగామ మల్లేష్, కిరణ్, గంగనామోని సాయి, ఆఫ్సర్ పాషా, వార్డు ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

## మహిళల ఆరోగ్యం, జీవనోపాధి అవకాశాలపై దృష్టి

**రంగారెడ్డి జిల్లా అర్బన్ మార్చి 10,ప్రభాతవార్త :** మహిళలు ధైర్యంగా కలలు కంటే స్థిరమైన జీవనోపాధి మార్గాలు ఎలా ఏర్పరుచుకోవచ్చో రాష్ట్ర మహిళలు తమ అనుభవాలతో వివరించారు. మహిళ దినోత్సవం పురస్కరించుకొని శంషాబాద్ పరిధిలోని పెద్దషాపూర్‌లో మహిళల ఆధ్వర్యంలో వ్యాపారాలు, సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు షీ అండ్ వీ వుమెన్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఫౌండేషన్, అమెజాన్ ఇండియా కలిసితో డేర్ టు డ్రీమ్ పేరిట కార్య క్రమం నిర్వహించారు. ఈ వేడుకకు మహిళా పారిశ్రామికవేత్తలు, సమాజ నాయకులు, ప్రభుత్వ ప్రతినిధులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు. సమాజాల్లో మహిళల ఆరోగ్యం, జీవనోపాధి అవకాశాల మెరుగుదలపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. రుతుక్రమ ఆరోగ్యంపై అవగాహన, స్థానిక స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాల ద్వారా పన్నెండు గ్రామపంచాయతీలలోని మహిళలు, బాలికల వరకు ఈ కార్యక్రమం చేరింది. అమెజాన్ కార్యకలాపాలు సాగుతున్న ప్రాంతాల చుట్టూ సమాజాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలనే విస్తృత లక్ష్యంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకొచ్చిందని తెలిపారు. 150 మందికి పైగా మహిళలు స్వయం ఆధారిత వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.సరైన మార్గదర్శనం, శిక్షణ, మెంటారింగ్, కోచింగ్ అందితే ప్రతి వ్యక్తి పారిశ్రామికవేత్తగా ఎదగగలరని ఇక్కడి మహిళలు నిరూపిస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో షీ అండ్ వీ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ డా. కృతి పటేల్ ,ఏఎంజడ్ఎల్ ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ సలీం రఫిక్ మెమన్ ,స్థానిక మహిళలు,తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మహిళల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న పలువురు ప్రతినిధులు

## పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు

**-3 బృందాల సిబ్బందితో పంపిణీ: పద్మిని**

**ఘట్‌కేసర్, మార్చి 10, ప్రభాతవార్త:** పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించి రోగాల భారి నుంచి కాపాడాలని మండల పశువైద్యాధికారిణి ఎం.పద్మిని పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని ఆమె చెప్పారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, అంకుశాపూర్ పశువైద్య సిబ్బంది నిర్ణిత తేదీలలో మూడు బృందాలుగా వెళ్లి పశువులకు టీకాలు వేస్తారని ఆమె తెలిపారు. ఎదులాబాద్‌లో ఈనెల 10 నుంచి 31వరకు, మర్రిపల్లిగూడలో ఏప్రిల్ 1 నుంచి 4 వరకు, కొత్తగూడెం, పోతరాజుగూడెంలో ఏప్రిల్ 5 నుంచి 9 వరకు, అంకుశాపూర్‌లో ఈనెల 10 నుంచి 26 వరకు, అవుషాపూర్, మాధారంలో ఈనెల 27 నుంచి ఏప్రిల్ 4 వరకు, చర్లపల్లిలో ఈనెల 10 నుంచి 17 వరకు, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఈనెల 17 నుంచి 22 వరకు, మల్లాపూర్‌లో ఈనెల 23 నుంచి ఏప్రిల్ 2 వరకు,టీకాలు వేస్తామని అన్నారు.

## తలసేమియా వ్యాధుల నివారణకు వాటి పరీక్షలు కీలకం

**..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**
**..పాల్గొన్న ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికగుప్తా**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 10, ప్రభాతవార్త**

తలసేమియా వంటి వ్యాదులను నివారించటానికి ప్రజల్లో అవగాహనతో పాటు పరీక్షల ద్వారా కూడ నివారించవచ్చని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి ఏరియా ఆసుపత్రిలో తలసేమియా వంటి రక్త సంబంధిత వ్యాధుల నుంచి రక్షించాలనే లక్ష్యంతో తలసేమియా, సికిల్‌సెల్, అనీమియాలపై అవగాహన కల్పిస్తూ నివారణకై కార్యక్రమాన్ని టివీవీపి ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా పెళ్లికి ముందు యువత హెచ్‌పిఎల్‌సి పరీక్ష చేయించుకోవటం ద్వారా ఈ సమస్యను ముందుగానే గుర్తించి నివారించవచ్చని అన్నారు. అందరితో పాటు తాను కూడ ఈ పరీక్ష చేసుకుని అందరికి ఆదర్శంగ ఉంటానని ఆయన ప్రకటించారు. ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికగుప్తా మాట్లాడుతూ తలసేమియా మేజర్‌తో పుట్టిన పిల్లలకు జీవితాంతం చికిత్స అవసరం అవుతుందని అన్నారు. అలాంటి పిల్లలకు సాధారణంగ ప్రతి 15-10రోజులకు ఒక సారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. ఒక రోగి జీవితకాలం చికిత్స ఖర్చు సుమారు రూ.1.5కోట్ల వరకు చేరవచ్చని, అంతే కాకుండ కుటుంబాలకు మానసిక, ఆర్థిక భారం కూడ పెరుగుతుందని ఆమె అన్నారు. వైద్య నిపుణుల ప్రకారం దేశంలో 3నుంచి4శాతం వరకు తలసేమియా క్యారియర్లు ఉన్నారన్నారు. ఇద్దరు క్యారియర్లు పెళ్లి చేసుకుంటే 25శాతం అవకాశం పిల్లలు తలసేమియా మేజర్‌తో పుట్టే ప్రమాదం ఉందన్నారు. అయితే పెళ్లికి ముందే ఒక చిన్న హెచ్‌పిఎల్‌సి రక్త పరీక్ష చేయించుకోవటం ద్వారా ఈ ప్రమాదాన్ని ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలోని ఆసుపత్రుల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించ బడుతాయన్నారు. ముఖ్యంగా 18నుంచి 40సంవత్సరాల మధ్య యువతపై ప్రత్యేక దృష్టి పెట్టి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది, మహిళా సంఘాలు వారితో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వసంతకుమారి, డాక్టర్ సునీత (డిసిహెచ్ఎస్-టివివిపి), డాక్టర్ గాయత్రి, బ్లడ్ వారియర్స్ ఫౌండేషన్ వారు తదితరులు పాల్గొన్నారు.



తలసేమియా, సికిల్‌సెల్, అనీమియాల నివారణకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పాల్గొన్న ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికగుప్తా, వైద్య తదితర అధికారుల దృశ్యం

## అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**-- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**తాండూరు, మార్చి 10, ప్రభాతవార్త :** అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తాండూరులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంతేకాకుండా ఇప్పటి వరకుగ్రౌండింగ్ కాని ఇందిరమ్మ ఇళ్ల లిస్ట్ తయారు చేయాలని సూచించారు. ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 99రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలు విజయవంతం చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని హౌసింగ్ ఏఈ, ఎంపీడీఓలను ఆదేశించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అనిత, ఎంపిడీఓలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.

## పర్సాపూర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**

**కొడంగల్,మార్చి 10ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలోని 5వ వార్డులో సీసీ రోడ్డు పనులను కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,గ్రామ సర్పంచ్ కన్నం రాధ శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగా గత సర్పంచ్ ఎన్నికలకు ముందు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మానానికి కృషి చేస్తామని ఇచ్చిన హామీ మేరకు మంగళవారం 5వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంబిస్తున్నట్లు తెలిపారు.గత పాలకులు గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని,అలాంటిది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,కాంగ్రేస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిల సహకారంతో గ్రామాల అభివృద్ధి పుష్కలంగా నిధులు మంజూరీ అవుతుండడంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు.రానున్న కాలంలో అభివృద్ధి పనులను చేపడుతూ రాష్ట్రంలోని అభివృద్ధిలో కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బెస్త శివమ్మ,గ్రామ మాజీ ఎంపీటీసీ తట్టెపల్లి రాములు,గ్రామ అద్యక్షులు బాణకారి రాములు,వార్డు సభ్యులు జి.సాయమ్మగొల్ల మానెమ్మ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనందం,సురేష్,ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం,గొల్ల మల్లప్ప,గొల్ల బాలప్ప,హన్మంతు,భాణకారి నర్సిములు,కాంగ్రేస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,యువకులు బైండ్ల హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.



పర్సాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్,సర్పంచ్



పర్వాతాపూర్ రోడ్డులో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న నిందితుడితో పాటు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న

## 1.3 కేజీల ఎండు గంజాయి స్వాధీనం

**పట్టుకున్న ఎస్టీఎఫ్ ఎ టీం**

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 10, ప్రభాత వార్త:** 1.3 కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ విక్రయాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని ఎస్టీఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డితో పాటు సిబ్బంది పట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫీర్జాదీగూడ పర్వాతాపూర్ రోడ్డులో గంజాయి అమ్మకాలు జరుపుతుండగా ఎస్టీఎఫ్ ఏ టీం సభ్యులు పట్టుకున్నారు. గంజాయి విక్రయానికి పాల్పడుతున్న కుమ్మరి గోపి అదుపులోకి తీసుకుని 1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదే కేసులో మున్నా అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్టీఎఫ్ ఏ టీం సభ్యులు తెలిపారు. పట్టుబడిన నిందితుడితో పాటు గంజాయిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్టీఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.



ఎండు గంజాయి కల్గియున్న నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు.

## 550 గ్రాముల గంజాయితో విక్రేత అరెస్టు

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 10,ప్రభాత వార్త:** అక్రమంగా గంజాయి కల్గియున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 550 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు కీసర మండలం రాంపల్లిలోని ఓ ఇంటిలో గంజాయి నిల్వఉంచి విక్రయిస్తున్నాడని సమాచారం అందగా పోలీసులు డి. కార్తీక్ గౌడ్ అనే వ్యక్తి ప్లాట్‌లో తనిఖీ చేయగా 550 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా నిల్వఉంచిన గంజాయి విషయమై నిందితుడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దుద్దేడ కార్తీక్ గౌడ్‌గా తెలిపారు. సిద్దిపేట్ పరిధిలోని ఖాదర్‌పురావాసిగా నిందితుడు కార్తీక్ గౌడ్ పోలీసులకు తెలిపాడు. పట్టుబడిన నిందితుడి వద్ద నుండి 550 గ్రాముల ఎండు గంజాయితోపాటు వివో గ్రే కలర్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

**కేశంపేట, మార్చి 10, ప్రభాతవార్త :** వీరనారి చదువుల తల్లి భారత దేశపు తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే కు ఘన నివాళులు. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీకాంత్ సార్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయులుగా సావిత్రిబాయి పూలే చరిత్ర పుటల్లో నిలిచిపోయిందని పేర్కొన్నారు . మహారాష్ట్ర లో నిరుపేద కుటుంబంలో జన్మించిన సావిత్రిబాయి పూలే కు చిన్న వయసులోనే మహాత్మ జ్యోతిరావు పూలే తో బాల్య వివాహం జరిగింది. చదివే ఈ సమాజం యొక్క మార్పుకు,ప్రగతికి మూలమని గ్రహించిన జ్యోతిరావు పూలే తన భార్య సావిత్రిబాయి పూలేను చదివించి భారతదేశ చరిత్రలో తొలి మహిళా టీచర్‌గా చేశాడు.

**వివిఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో..**

**కొడంగల్,మార్చి 10ప్రభాతవార్త:** సావిత్రిభాయి పూలే 128వ వర్ధంతిని మంగళవారం పట్టణంలోని వివిఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహకులు భీంరాజ్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సామాజిక విప్లవకారుడిగా ఘనతకెక్కిన జ్యోతిభా పూలే సతీమణి సావిత్రిభాయి పూలే కులమతాల పేరుతో తరతరాలుగా అణిచివేతకు గురైన నిమ్నజాతి ప్రజలకు అత్మస్థైర్యం కల్పించి,వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిభాపూలే సతీమణి సావిత్రిభాయి పూలే అంలూ అమె సేవలను కొనియాడారు.

## రోడ్డు ఆక్రమంచి నిర్మాణంపై ఎంఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు

**ఘట్‌కేసర్, మార్చి 10, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ బొక్కోనిగూడ పోచమ్మబస్తీలో భూపతి భరత్ ఇంటి ఎదురుగా రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేసినా అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు కట్ట హరినాథ్‌రెడ్డి, మల్లేశ్‌లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. తార్నాకలోని ఎంఎంసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వారు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. శ్రీహారి అనే వ్యక్తి నిబంధనలకు విరుద్దంగా రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడని గత ఏప్రిల్ 29న ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు పోచమ్మబస్తీ వాసులు ఫిర్యాదు చేయగా ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గత జూన్ 2న, 16న మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఇంటి యాజమానికి వివరణ కోరుతూ నోటీసు జారీ చేశారని గత జూలై 6న జేసీబీ సాయంతో అధికారులు ఇంటి బేస్‌మెంట్‌ను కూల్చీవేశారని పేర్కొన్నారు. అయినప్పటికి నిర్మాణ దారుడు శ్రీహరి ఇంటి నిర్మాణం పూర్తి చేసి బేస్‌మెంట్ కూల్చీ వేసిన చోట నుంచి తిరిగి రోడ్డును ఆక్రమించి ప్రహారిగోడ నిర్మాణం చేశారని ఈనెల 4న ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీసీ వాణి ఆదేశించారని, ఫిబ్రవరి 16న ఉప్పల్ జోన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికి టిపిఓ, సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. రోడ్లు ఆక్రమిస్తే భవిష్యత్తులో ప్రణాళిక బద్దంగా అభివృద్ధికి ఆటంకం కల్గి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని హరినాథ్‌నాథ్‌రెడ్డి, మల్లేశ్‌లు కమిషనర్‌ను కోరగా టిపిఓకు ఫోన్ చేసి చర్యలపై ఆరా తీశారు.





ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న వజ్రేష్ యాదవ్

## రంజాన్ కానుకల పంపిణీ

**మేడ్చల్, మార్చి 10. ప్రభాతవార్త :** రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు రంజాన్ కానుకల కిట్లను మేడ్చల్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ రంజాన్ కిట్లను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లిం కుటుంబాలకు సహాయం చేయడం ఎంతో మంచి కార్యక్రమమని అన్నారు. నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా రాఘవేందర్ గౌడ్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా కూడా నిర్వహించడం అభినందనీ యమని కొనియాడారు. కాగా మేడ్చల్ నియోజకవర్గంలో సుమారు వెయ్యి మంది ముస్లిం సోదరులకు ఈ కానుకలను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, నాయకులు దేవ, మల్లేష్ గౌడ్, చాపరాజు, రేగు రాజు, మహేష్, విజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యల తీసుకుంటాం

**సర్పంచ్ చంద్రభూపాల్ రావు**

**కుల్కచర్ల,మార్చి 10, ప్రభాతవార్త:** గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యల తీసుకుంటామని సర్పంచ్ చంద్ర భూపాల్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఎస్సి కాలని లో పైప్‌లైన్ వేయించారు. సర్పంచ్ చంద్రభూపాల్ రావు వెసవి కాలం దృష్టిల ఉంచుకొని గ్రామంలో నీటి సమస్య ఎక్కడ ఉన్న వెంటనే పరిష్కరిస్తునట్లు తెలిపారు.తాగు నీటిసమస్య తలెత్తకుండా ఎప్పటి కప్పుడు చర్యలు చేపడుతున్నమని పేర్కొన్నారు.ప్రజలునీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.



ఎస్సికాలనిలో పైప్ లైన్ వేయిస్తున్న సర్పంచ్

## మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**కేశంపేట, మార్చి 10, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని భైర్ఖన్ పల్లి గ్రామానికి చెందిన జ్యోతి అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం మంగళవారం గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు. వారితో పాటు గ్రామ మాజీ సర్పంచ్ రాఘవేంద్ర రావు 1000, నరసింహ శర్మ 1000 , యం.అఖిల్1000 రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో కుమ్మరి బాలరాజు, శేఖర్, రాఘవేందర్,నరేష్ ఆంజనేయులు, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

## ఆరుట్ల పబ్లిక్ స్కూల్‌లోఎఐఎస్‌ఎఫ్ బృందం



తెలంగాణ పబ్లిక్ మోడల్ స్కూల్ ను సందర్శిస్తున్న ఎఐఎస్‌ఎఫ్ నాయకులు

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో మోడల్ గా నిర్మిస్తూ అభివృద్ధి చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ మోడల్ ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బృందం తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ఐఎఎస్(రిటైర్డ్)తో కలిసి సందర్శించడం జరిగింది.ఈ సందర్శనలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రెహమాన్, గ్యార క్రాంతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అన్వర్, ఆకాష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులన్నింటికీ టీకాలు వేయించండి

**పశువైద్యాధికారి వెంకటేష్**



**కొందుర్గు, మార్చి 10, ప్రభాతవార్త :** ముందు జాగ్రత్త చర్యగా పశువులన్నింటికీ గాలి కుంటివ్యాధి సుఖకుండా టీకాలు వేయించాలని డాక్టర్ వెంకటేష్ రైతులను కోరారు.మంగళవారం ఆయన మండల కేంద్రంలోని కొందుర్గు పడమర శివారులో వ్యవసాయ పొలాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తీశారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఈ ఉచిత వ్యాధి నిరోధక టీకాలను ప్రతి రైతు తమ పశువులకు టీకాలు వేయించి జాగ్రత్త పడాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చౌడ ప్రభాకర్,ఉప సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్, ఎల్.ఎస్ ఏ. మాధవి తోపాటు పంచాయతీ సభ్యులు, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

**విద్యుత్ కార్మికులు**

**శామీర్‌పేట, మార్చి 10, ప్రభాతవార్త**

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని శామీర్‌పేట విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ కార్మికులు స్పష్టం చేశారు.

మంగళవారం విద్యుత్ కార్మికుల మహాధర్నాకు శామీర్‌పేట పెద్ద చెరువుకట్ట మైసమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేసి వారు మహాధర్నాకు తరలివెళ్లారు. విద్యుత్ యాజమాన్యం స్పందించే వరకు పరిష్కరించే వరకు ఈ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని శామీర్‌పేట, అలియాబాద్ విద్యుత్ సెక్షన్స్ పరిధిలోని కార్మికులు ధర్నాకు తరలివెళ్లారు.

# నాగిశెట్టిపల్లి,లింగాపూర్ తండాల్లో శ్రమదానం

..పాల్గొన్న మూడుచింతపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి

**శామీర్‌పేట, మార్చి, 10, ప్రభాతవార్త**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా లింగాపూర్ తండ, నాగిశెట్టిపల్లి గ్రామాల్లో జరిగిన శ్రమదానం కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, పలువురు నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 7వ వార్డు నాగిశెట్టిపల్లి,లింగాపూర్ తండల్లో శ్రమదానం కార్యక్రమంను నిర్వహించి రోడ్ల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కౌన్సిలర్లు నవీన్, నీరజ్‌గౌడ్, చిన్నలచ్చ సరిత,శ్రీనివాస్‌గౌడ్,,మేనేజర్ ఉషా, ఆర్‌ఓ గౌతమి, రాజేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, మాజీ సర్పంచ కృపాకర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఆయా గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో నాగిశెట్టిపల్లి,లింగాపూర్ తండల్లో జరిగిన శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్న మూడుచింతపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి,పలువురు కౌన్సిలర్లు, తదితరుల దృశ్యం

# అభిమానుల రుణం తీర్చుకోలేనిది

- ప్రతి ఎన్నికలోనూ వెన్నంటి ఉంటున్నారు
- పరిశ్రమల్లో స్థానికులకే ఎక్కువ ఉద్యోగాలు ఇస్తున్నాం
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఘనంగా శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ర్యాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు తాండూరులో ఘనంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయన అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాలు చేపట్టారు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి సోదరుడైన స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మరోసోదరుడు సత్యనారాయణరెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు. సోదరునికి కేక్ తినిపించి సంబరాలు జరిపారు. తాండూరు, పరిగి, కొడంగల్, వికారాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవయే పరమావధిగా పని చేస్తున్న తమ పట్ల ప్రజలు అభిమానం ఏర్పరుచుకున్నారని, వారి రుణం తీర్చుకోలేనిదని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశీస్సులతో తాండూరు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తమ పిలుపు మేరకు



సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి పుట్టిరోజు వేడుకల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పాటల సిడిని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో వెన్నంటి ఉంటూ మంచి మెజార్టీతో గెలిపించారని, ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు విశ్వాసం చూపించారని కొనియాడారు. ఆర్బీవోఎల్ పరిశ్రమలో స్థానికులకే ఎక్కువ ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మంచి ఉద్యోగం, వేతనం, ఇతర వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఇటు నియోజకవర్గ ప్రజలకే కాకుండా తమ పరిశ్రమ ఉద్యోగులకూ అండగా ఉంటామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీవోఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళా శ్రీనివాస్‌రెడ్డి, బుయ్యని బ్రిజేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింహులు, ప్రముఖ వ్యాపారవేత్త కల్వ రాధాకృష్ణ, మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ అల్లాపూర్ శ్రీకాంత్ ముదిరాజ్, 27వ వార్డు కౌన్సిలర్ స్వరూపా మల్లేష్, కౌన్సిలర్లు బంటు వేణు, భావిగి భద్రేశ్వర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కిరణ్‌పటేల్, భరత్‌రెడ్డి, బాతుల నాగు, వికాస్ జోషి, విష్ణువర్ధన్‌రెడ్డి, అజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌ను షాన్‌దార్‌గా మారుస్తా

మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బస్వం



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** మున్సిపాలిటీలో చేపడుతున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్‌ను షాన్‌దార్ గా మారుస్తామని మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బస్వం అన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని 18 ,26 వార్డుల్లో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండులో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 26వ వార్డు కౌన్సిలర్ ఎస్పి శివ, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, దిలీప్ కుమార్, సంతోషి భాయ్, చందూలాల్, శంకర్, గంగమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఊరెల్ల పాఠశాలకు కంప్యూటర్లు, క్రీడా సామాగ్రి పంపిణీ

**చేవెళ్ల, మార్చి 10, ప్రభాతవార్త :** రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ సభ్యులు ఊరెల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, ఫర్నిచర్, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు మరియు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ అధ్యక్షుడు కళ్యాణ్ పంగులూరి, కార్యదర్శి లక్ష్మి ్మ విసిరెడ్డి, సభ్యులు బాలకోటి సర్, చక్రవర్తి సర్ పాల్గొని పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. యాదగిరి, సిబ్బంది కె. శేఖర్, ఎస్. వెంకటేశం, పి. ప్రవీణ్, పి. సునీతతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ఉపాధ్యాయులు రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఊరెల్ల పాఠశాలకు కంప్యూటర్లు, క్రీడా సామగ్రి పంపిణీచేవెళ్ల, మార్చి 10, ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ సభ్యులు ఊరెల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, ఫర్నిచర్, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు మరియు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ అధ్యక్షుడు కళ్యాణ్ పంగులూరి, కార్యదర్శి లక్ష్మి ్మ విసిరెడ్డి, సభ్యులు బాలకోటి సర్, చక్రవర్తి సర్ పాల్గొని పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. యాదగిరి, సిబ్బంది కె. శేఖర్, ఎస్. వెంకటేశం, పి. ప్రవీణ్, పి. సునీతతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ఉపాధ్యాయులు రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



# పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

**కొడంగల్,మార్చి 10,ప్రభాతవార్త:** పది వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలంగాణా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మేన్,పాఠశాల చైర్మేన్ ఆర్.గురునాథ్‌రెడ్డి అన్నారు.మంగళవారం పట్టణంలోని శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్శికోత్సవ వేడుకలు,పదో తరగతి విద్యార్దులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్ది జీవితంలో 10వ తరగతి తొలిమెట్టని,కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు మేదన్నారు.విద్యతోనే అభివృద్ది సాధ్యమని,సమాజంలో విద్యతోనే మంచి గుర్తింపు ఉంటుందన్నారు.ఇందుకుగాను ఈనెల 14 నుండి జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఇటు తల్లిదండ్రులకు అటు పాఠశాలకు మంచి పేరుతీసుకురావాలని అన్నారు. అనంతరం విద్యార్దులకు హాల్‌న టికెట్‌లను అందించారు. అలాగే విద్యార్దులు నిర్వహించిన సాంస్రృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి,పాఠశాల కార్యదర్శి లోకూర్తి జయతీర్థాచారి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య,ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.



విద్యార్దులకు హాల్‌టికెట్‌లను అందిస్తున్న చైర్మన్ గురునాథ్‌రెడ్డి

# ఘనంగా వీడ్కోలు సమావేశాలు

**దుద్యాల్, మార్చి 10, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హస్నాబాద్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మల్లప్ప, నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పై చదువులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, సుధాకర్ రావు, ముస్తాక్ పటేల్, రాములు, ముకుంద రెడ్డి, రమేష్, రవి నాయక్, బాల్రాజ్, శ్రీశైలం, అనిల్ మాధవి, సాలిబాయి, చంద్రకళ, వీడ్కోలు పొందుతున్న పదవ తరగతి విద్యార్థులు, 9వ తరగతి విద్యార్థులు



విద్యార్థులు, ఉపాధ్యాయులు

జర్నలిస్టులపై దాడి అమానుషం

# చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

**కొడంగల్,మార్చి 10,ప్రభాతవార్త:** రోడ్డు విస్తరణ పేరుతో చిరు వ్యాపారుల జీవనాధారం లేకుండా చేయడం సరికాదని,తక్షణమే చిరు వ్యాపారులను ఆదుకోవాలని ఎంఐఎం పార్టీ తాలూకా అధ్యక్షులు ఎస్బీ.గుల్షన్ డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన చిరు వ్యాపారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.కొడంగల్ పట్టణంలో ఫుట్ పాత్‌లపై,తోపుడు బండ్లపై చిన్ని చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పేరుతో వారికి జీవనాధారం లేకుండా కుటుంబాలను రోడ్ల పాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.గత 8 నెలల క్రితం అభివృద్ది పేరుతో చిరు వ్యాపారులకు ప్రత్యాహ్నమయం చూపకుండా మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల దుకాణాలు తొలగిండచం జరిగిందన్నారు.చిరు వ్యాపారాలతో వారి కుటుంబాలకు పోషించుకుంటున్న వారిని ఇబ్బంది పెట్టడం వల్ల వారి కుటుంబాలు ఆర్దిక నష్టపోతున్నారని అన్నారు.వారిని బలవంతంగా తొలగించకుండా ప్రత్యాహ్నమయం చూపించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదేనన్నారు.కానీ స్దానిక మున్సిపల్ కమీషనర్ తాను చెప్పిందే వేదంగా ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు.ఇప్పటికైనా చిరు వ్యాపారులకు బస్టాండ్ ముందు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదుకోవాలన్నారు.లేని పక్షంలో చిరు వ్యాపారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.అలాగే తాజాగా పన్నుల పేరుతో అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు.అభివృద్ది పేరుతో మున్సిపాలిటీలోని వార్డుల్లో రోడ్లను ఇష్టా రాజ్యాంగ తవ్వి వదిలేశారని అన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో అభివృద్ది శూన్యమని,డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలేసి రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం చేపట్టడడం సరికాదన్నారు.కొడంగల్ అంబేద్కర్ చౌరస్తా విస్తరణ కాగితాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఎండీ.సర్తాజ్ హుస్సేన్,సయ్యద్ మహముద్, ఎండీ.కబీర్,సయ్యద్ ముస్తాఫా,ఎండీ.షారుక్ ,ఎండీ.సలీం,ఎండీ.రఫీ ,మణెమ్మ,మొహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

# విద్యాహక్కు చట్టంని పకడ్బందీగా అమలు చేయాలి

**చేవెళ్ల, మార్చి 10, ప్రభాతవార్త :**2009 విద్యాహక్కు చట్టం ఆర్టికల్ 21ఏ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాలకు 25శాతం ఉచిత సీట్లు ఇవ్వాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పిడిఎస్ యు ) ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్డిఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ మాట్లాడుతూఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం భారతదేశంలో 6 14 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ ఉచిత మరియు నిర్బంధ విద్యను తప్పనిసరిగా చట్టం చేస్తూ ఆర్టికల్ 21 ఏ ప్రకారం విద్య ఒక ప్రాథమిక హక్కు దీని ప్రకారం ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలలో 25శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ దీనిని ఎక్కడ అమలు పరచడం లేదు ఉన్నత అధికారులు చర్చించి వచ్చే విద్య అకాడమిక్ 20262027 లో విద్యార్థులు పాఠశాలల్లో అడ్మిషన్స్ తీసుకునే ముందు చట్ట ప్రకారం అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ఎంతోమంది తల్లిదండ్రులు లేని విద్యార్థులు ఆర్థిక పరిస్థితులను ఎదుర్కోలేని ప్రజల పిల్లలకు, కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలలో 25 శాతం సీట్లు కచ్చితంగా పేద విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బొజ్జి శ్రీకాంత్, సహాయ కార్యదర్శి న్యాలట అశోక్, సునీల్ ఉన్నారు.



లియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న ఎంఎంసి చైర్మన్ నర్సింలుయాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, ఎడిఎ వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా ఆర్టీఎ మెంబర్ జైపాల్‌రెడ్డి,రైతుల తదితరుల దృశ్యం

# రైతులకు ఆత్మ పథకం కింద శిక్షణా కార్యక్రమం

**శామీర్‌పేట, మార్చి 10, ప్రభాతవార్త:** వ్యవసాయం సాగుపై రైతులకు నిర్వహిస్తునన శిక్షణా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా వద్ద గల రైతు వేదికలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో రైతులకు ఆత్మ పథకం కింద శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనిలో పాల్గొన్న మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంలో సాంకేతికంగా యంత్రీకరణో పంటల సాగుపై శిక్షణ ఇస్తున్నందున రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు మేలు రకం విత్తనాల ఎంపిక, నానోయూరియా వాడకం, వ్యవసాయ యంత్రీకరణ, యూరియా బుకింగ్, యాప్, వరి పంటలో చేయాల్సిన మెలుకవలపై వివరించటం జరుగు తుందన్నారు. జిల్లా వ్యవసాయఅధికారి చంద్రకళ ఆధ్వర్యంలో ఆత్మ పథకం కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాన్ని రైతులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ ఎడిఏ వెంకట్రామరెడ్డి, శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేష్, ఎఇఒలు రవికుమార్, సుధీర్‌కుమార్‌లు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వారితో పాటు మేడ్చల్ ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, కౌన్సిలర్లు వెంకటేశులు, జశ్వంత్‌రెడ్డి, దీపిక, హనుమాన్‌దాస్, ఎస్.వనజ, మౌనిక, దీప, యమున, వెంకటేశ, రైతులు కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, హరిశంకర్‌గౌడ్, ఆనంద్, యాదయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవో పార్థసింహారెడ్డిని కలిసిన రావులపల్లి సర్పంచ్

**చేవెళ్ల, మార్చి 10, ప్రభాతవార్త :** ఇటీవల చేవెళ్ల ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన కె. పార్థసింహారెడ్డిని మంగళవారం రావులపల్లి సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనూష అంజన్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, మాజీ ఉప సర్పంచ్ నాగిరెడ్డి పాల్గొన్నారు. నాయకులు గోటూరి కుమార్ గౌడ్, బూర్ల శ్రీనివాస్, ప్రవీణ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

# ఆలయ ప్రగతికి విరాళం

**చేవెళ్ల, మార్చి 10, ప్రభాతవార్త :** చేవెళ్ల పట్టణానికి చెందిన ఒగ్గు లక్ష ్మయ్య తన కుమారుడు ఒగ్గు ప్రభాకర్ పుట్టిన రోజు సందర్భంగా మల్లన్న ఆలయ అభివృద్ధికి భారీ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు రూ. 51,000ను అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని భగవంతుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షి ంచారు.

# టిడబ్ల్యూజెఎఫ్ చేవెళ్ల డివిజన్ కమిటీ సంఘీభావం..

టిడబ్ల్యూజెఎఫ్ చేవెళ్ల అధ్యక్షుడు రాజు ఆగ్రహం

**శంకర్‌పల్లి, మార్చి 10, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు శివగళ్ల శేఖర్, నాగర్‌గూడ నరేందర్‌లపై జరిగిన దాడిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ చేవెళ్ల డివిజన్ అధ్యక్షులు చేగూరి రాజు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులపై భౌతిక దాడికి పాల్పడిన నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టులు తలుచుకుని పెన్ డౌన్ చేస్తే ప్రభుత్వ యంత్రాంగం స్తంభించిపోతుందని, పాలకులకు ప్రజలకు మధ్య వారధిగా ఉండే వ్యవస్థకు విఘాతం కలిగించడం ఎవరికీ మంచిది కాదని హెచ్చరించారు. దాడికి గురైన జర్నలిస్టులకు సంఘం అండగా ఉంటుందని, నిందితులకు శిక్ష పడే వరకు పోరాడుతామని రాజు స్పష్టం చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ చేవెళ్ల డివిజన్ కమిటీ తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# కొనసాగుతున్న పాంబండ బ్రహ్మోత్సవాలు

**కుల్కచర్ల,మార్చి 9 ప్రభాతవార్త:** శ్రీ పాంబండ రామలింగేశ్వ స్వామి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మంగళవారం బండ్లు తిరుగుట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.స్వామి వారి పల్లకి సేవతో పాటు బండవెల్కిచర్ల గ్రామవాహనాలు పెద్ద ఎత్తున్న గుడి చూట్టు తిరిగాయి. స్వామి పల్లకి సేవలో ఆలయ ఛైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, సర్పంచ్ మడుగు శ్రీనివాస్ పాల్గొని భక్తి శ్రద్దలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్వామి వారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# ఇంటి పట్టా ఇచ్చారు.. ఆనందాలను తెచ్చారు..

**షాద్‌నగర్, మార్చి 10, ప్రభాతవార్త :** ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇంటి పట్టాలు చేతికి అందాయి.. అనుకున్న కల సాకారం కావడంతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందాలు నిండాయి.. పట్టణంలోని 17వ వార్డులో దృశ్యమిది. ఈ వార్డులో లబ్ధిదారులకు మంజూరైన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పట్టాలను మంగళవారం కౌన్సిలర్ నాజియా బేగం సర్వర్ పాషాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ చేపట్టారని, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద తాగునీరు, రహదారులు, విద్యుత్, కాలువల నిర్మాణం వంటి సదుపాయాలను కల్పించి అనంతరం ఇండ్లను ఇచ్చారని వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వడం జరిగిందన్నారు.

# రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ

..మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్

**శామీర్‌పేట, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు,పనిముట్లను అందజేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్ సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా వద్ద గల రైతువేధిక వద్ద రైతులకు ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి వ్యవసాయ పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతులకు వాటిని సబ్సిడీపై వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, వ్యవసారంగంలో రైతులు రాణించటానికి సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, పరికరాలు అందజేస్తున్నట్లు రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు వ్యవసాయ యంత్రాలను యాంత్రీకరణ పనిముట్లను అందజేస్తుందని, రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు రోటోవేటర్లు, స్ప్రేయర్లు, బేలర్స్, సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ కన్‌రెడ్డి మాలతిమాదవరెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, కౌన్సిలర్లు ఎస్.జశ్వంత్‌రెడ్డి, దీపిక, హనుమాన్‌దాస్, ఎస్.వనజ, మౌనిక, దీపా, యమున, వెంకటేశ, రైతు సంఘం మాజీ అధ్యక్షులు, నాయకులు కంఠం కృష్ణారెడ్డి,జిల్లా రైతు అధ్యక్షులు ఎం.సంజీవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, హరిశంకర్‌గౌడ్, ఆనంద్, యాదయ్య, మేడ్చల్ ఎడిఎ వెంకట్రామరెడ్డి, శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేశ్, ఎంఇఒ రవికుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, రైతుల,కౌన్సిలర్ల దృశ్యం

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

..మున్సిపల్ చైర్మన్ జామ్ రవి

**శామీర్‌పేట, మార్చి 10, ప్రభాతవార్త :**కేశవరం గ్రామానికి చెందిన ఏర్పుల లక్ష్మి (75) మృతిచెందటంతో ఆమె అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి సానుబూతిని తెలిపి ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని కేశవరంలో 24వార్డులో ఏర్పుల లక్ష్మి మృతిచెందినట్లు చైర్మన్‌కు స్థానిక కౌన్సిలర్ కొంపల్లి మాదవిభూమేశ్‌గౌడ్ సమాచారం ఇవ్వటంతో ఆయన విచ్చేసి బాధితకుటుంబానికి సానుబూతిని తెలియజేసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చైర్మన్ జామ్ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీరజ్‌గౌడ్, నవీన్, బిఆర్ఎస్ అధ్యక్షులు భూమేశ్‌గౌడ్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పోతారంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ

**శామీర్‌పేట, మార్చి 10, ప్రభాతవార్త:** పోతారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మంజూరు పొందిన లబ్దిదారులకు సంబంధించి ఇళ్ల నిర్మాణాలకు మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ భూమి పూజ చేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పోతారం (2వ వార్డులో) ఆయనతో పాటు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ పాల్గొని ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి నిర్మాణాలకు ముహూర్తం చేశారు. పోతారం గ్రామానికి చెందిన మోర లక్ష్మి, మోర అరుణ, జిలకర లక్ష్మి, వంగ లలిత, రత్నాల శాంతమ్మలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావటంతో ఇళ్ల నిర్మాణాలకు వారు భూమి పూజలు చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షల చొప్పున లబ్దిదారులకు చెల్లిస్తుందని అన్నారు. ఆ తరువాత మూడుచింతలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెర్రిపోతుల నర్సింలు పరీక్షల ప్యాడ్స్‌ను అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు ఫస్ట్ వచ్చిన విద్యార్థికి నగదు బహుమతి 5,016రూపాయలు అందజేస్తానని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో వారితో పాటు కాంగ్రెస్ నాయకులు రత్నాల మహేశ్, జెర్రిపోతుల నర్సింలు, శ్రీకాంత్‌గౌడ్, భస్వారెడ్డి, దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి అఖిలేశ్‌రెడ్డి, ఆర్.మోహన్‌రెడ్డి, హరిబాబు, ఎం.రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# సావిత్రీబాయి పూలే వర్ధంతి

**చేవెళ్ల, మార్చి 10, ప్రభాతవార్త :** సామాజిక సంస్కర్త, మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా చేవెళ్లలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు అత్తెలి అనంతరెడ్డి, యువ నాయకులు డాక్టర్ వైభవ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు అశోక్ పాల్గొని ఆమె సేవలను స్మరించుకున్నారు. మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేష్, గాజులగూడెం శ్రీను, పిసరి శ్రీకాంత్, అల్లాడా అభిషేకర్, గణేశ్, జైసింహ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా నాయకులు, ఉపాధ్యాయులకు సత్కారం

**చేవెళ్ల, మార్చి 10, ప్రభాతవార్త :** ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా చేవెళ్ల మండలంలోని గుండాల జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, కౌన్సిలర్ ఎం. కళ్యాణి యాదగిరి, గుండాల గ్రామ ప్రథమ పౌరుడి సతీమణి మాలతి రెడ్డి, వార్డ్ సభ్యురాలు ఈశ్వరి భాయి, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, శివలీల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రెబెకా, జడ్పీహెచ్‌ఎస్ మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు మరి. శివానందం, జి. శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఓ. యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ సాయి చైతన్య పాల్గొన్నారు.అలాగే సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, మహిళా విద్య కోసం చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి, చదువు జీవితంలో ఎంతో ముఖ్యమని, కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలని నాయకులు, ఉపాధ్యాయులు సూచించారు.పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.5,000 బహుమతి అందజేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి ప్రకటించారు.

